## క్లుప్తంగా

### డబుల్ బెడ్రూం ఇళ్ల దరఖాస్తుల పరిశీలన



**ఆర్మూర్‌టౌన్:** మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను సిబ్బంది ఇంటింటి తిరుగుతూ పరిశీలిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, కమిషనర్ మనోహర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది వార్డుల్లో సర్వే చేస్తున్నారు. ఇళ్ల కోసం అర్హులైనవారి నుంచి ఇటీవల దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే.

### పనులు వేగవంతం చేయాలి



**బాల్కొండ:** మన ఊరు–మన బడి పనులను వేగవంతం చేయాలని డీఎల్పీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండలం వేంపల్లి, మెండోరా మండలం బుస్సాపూర్ లో మన ఊరు– మనబడి పనులను పరిశీలించారు. పనుల ఆలస్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, పీఆర్ఏఈ షరీఫ్, ఉప సర్పంచ్ జక్క గంగాధర్ తదితరులు ఉన్నారు.

### అభివృద్ధి పనులకు రూ. 10 కోట్లు మంజూరు

**ఆర్మూర్:** ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 10 కోట్ల మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా నిలపాలన్న ధ్యేయంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిధులను ఆర్మూర్ పట్టణ, రూరల్, నందిపేట్, మాక్లూర్ మండలాల్లో వివిధ సామాజిక వర్గాల కోసం ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

### అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం


**నవీపేట:** ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశాలతో పాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 4న పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
**నందిపేట్:** మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్ తెలిపారు. 6 వ తరగతిలో కొత్తగా ప్రవేశాలు, ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి ఫిబ్రవరి 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### ఫ్లెక్సీల ఏర్పాటు సరికాదు



**వర్ని:** సుభాష్ చంద్రబోస్ విగ్రహం చుట్టూ వివిధ పార్టీల నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం సరికాదని, వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నవీన్ తహసీల్దార్ విఠల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సందీప్, ప్రవీణ్, సాగర్ ,నరేష్, శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన కమిషనర్



**ఆర్మూర్‌టౌన్:** మున్సిపల్ కమిషనర్‌గా మనోహర్‌రావు మంగళవారం పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ సెలవులో వెళ్లడంతో ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలను మేనేజర్ మనోహర్‌కు అప్పగించారు.

### పోలింగ్ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన



**నందిపేట్:** మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో మంగళవారం ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన సదస్సులో భాగంగా మాక్ పోలింగ్ నిర్వహించారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్ నిర్వహణ, ఓటింగ్, ఓట్ల లెక్కింపు విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అరుణ్, ప్రధానోపాధ్యాయులు రవికిరణ్ పాల్గొన్నారు.

# ఆయిల్ పాంతో ఆదాయం

- ప్రభుత్వ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి
- రైతులకు అవగాహన కల్పించిన అధికారులు



మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లిలో ఆయిల్ పాం క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏవో పద్మ



రెంజర్లలో అయిల్ పాం తోటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఉద్యానవన శాఖ అధికారి, రైతులు

**బాల్కొండ:** అయిల్ పాం సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని భీంగల్ ఏడీఏ మల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ రైతులకు అయిల్ పాం సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయిల్ పాం సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. అంతర్ పంటల సాగు కోసం ఎకరానికి రూ. 4,200 అందిస్తుందన్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రైతులు సాగు చేస్తున్న అయిల్ పాం పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి రోహిత్, వ్యవసాయ అధికారి రాజుకుమార్, రైతు బంధు మండల కోఆర్డినేటర్ ముత్తెన్న, గ్రామ కోఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.
**మాక్లూర్:** మండలంలోని అడవి మామిడిపల్లిలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పాం క్షేత్రాన్ని మండల వ్యవసాయ అధికారిణి పి. పద్మ పరిశీలించారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి చెట్టుకు నీరందేలా డ్రిప్‌ను సరి చేసుకోవాలని రైతులకు సూచించారు. చెట్టును ఎంత పుష్టిగా పెంచితే అంత లాభం ఉంటుందన్నారు. ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఆయిల్ పాం సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చింత మల్లారెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారిణి ఉమాదేవి, రైతులు గణపతి, మోతిలాల్,, బాశెట్టి గంగాధర్, లక్ష్మన్, సాగర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**బోధన్:** కోటగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను హింసించిన బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌కు చెందిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. టీచర్ కుటుంబాన్ని మంగళవారం బోధన్‌లో సీఐటీయూ నాయకులు పరామర్శించారు. నాయకులు వీరయ్య, శ్రీకాంత్, రమేష్, శంకరగౌడ్, నూర్జ హాన్ తదితరులు పాల్గొన్నారు.
**కోటగిరి :** దళిత టీచర్‌ను విద్యార్థుల ఎదుటే హింసించడమే కాకుండా గుడి వరకు తీసుకెళ్లి బొట్టు పెట్టి అవమానించినా ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించకపోవడం శోచనీయం అని కేవీపీఎస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ టి. స్కైలాబ్ బాబు పేర్కొన్నారు. బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

**రుద్రూర్:** టీచర్ మల్లికార్జున్‌ను హింసించిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత ఐక్య వేదిక సభ్యులు ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ ముజీబ్, ఎస్సై రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, దళిత ఐక్య వేదిక సభ్యులు సంజీవులు, నవీన్, ప్రసాద్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### 'తపస్వీ' సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల లలిత

**ఆర్మూర్‌టౌన్:** అనాథ పిల్లల కోసం తపస్వి స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత అన్నారు. పెర్కిట్ సిటీ గార్డెన్‌లో తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నృత్య సౌరభం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకుల లలితతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తపస్వీకి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో తపస్వీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు పద్మావతి, చైర్మన్ సుశీల, స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ గంగాధర్, డైరెక్టర్ దిలీప్ రెడ్డి, కౌన్సిలర్ శంకర్ పాల్గొన్నారు.

### మాస్టర్ ప్లాన్‌ను నిలిపివేయాలి



ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

**రెంజల్:** రైతులకు ఇబ్బందులు కలిగించే కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాంచందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గమ్ముల గంగాధర్, పుట్టి నాగన్న, నసీర్, గోపాల్, పోశెట్టి, అంజన్న, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభం



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ ఉమ, జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి

**రుద్రూర్:** మోస్రా మండలం చింతకుంట గ్రామంలో నిర్మించనున్న ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి మంగళవారం ఎంపీపీ పిట్ల ఉమ, జెడ్పీటీసీ విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్ విమల, బీఆర్‌ఎస్ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం మైనారిటీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు హన్మంత్ రెడ్డి, సాయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బోధనేతర సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

**పెర్కిట్(ఆర్మూర్):** కేజీబీవీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న బోధనేతర సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. స్థానిక పెర్కిట్ కేజీబీవీ పాఠశాల ఎదుట మంగళవారం బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఎండీ ఖాజా మొయినుద్దీన్, సుంకర శ్రీనివాస్, పద్మ, భారతి, బాలయ్య, ఆశన్న, కేజీబీవీ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోలను సీజ్ చేయడం తగదు

**ఆర్మూర్‌టౌన్:** ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ తీరును మార్చుకోకపోతే డిపోను ముట్టడిస్తామని ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు పేర్కొన్నారు. పట్టణంలోని జావీద్ భాయ్ మినీ స్టేడియంలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీవో సహాయంతో డిపో మేనేజర్ ఆటోల్లో వెళ్తున్న ప్రయాణికులను దించి ఆర్టీసీ బస్సుల్లో పంపడమే కాకుండా ఆటోలను సీజ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని ఏసీపీకి వినతి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హాలిమ్, శ్రీనివాస్, సదానందం, రాజేశ్వర్, సిరాజోద్దీన్, తాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్లు

### రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



**బోధన్‌టౌన్:** వీధి వ్యాపారులు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అధికారులు సూచించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అధ్యక్షతన వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. తొలుత రూ.10 వేలు రుణం తీసుకొని తిరిగి చెల్లిస్తే రెండో సారి రూ. 20 వేలు రుణం అందిస్తామని, ఆ మొత్తాన్నీ చెల్లిస్తే రూ. 50 వేల రుణం ఇవ్వనున్నట్లు కమిషనర్ ఖమర్ అహ్మద్, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వీధి వ్యాపారులు రోడ్ల మీద విక్రయాలు చేపట్టకుండా పట్టణంలో కొత్త బస్టాండ్ దగ్గర, గాంధీ పార్కు, అంబేద్కర్ చౌరస్తా వద్ద విక్రయించేలా ప్రతిపాదించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ పీటర్, ఏపీవో శ్రీనివాస్‌రావు, బ్యాంకు మేనేజర్లు రంజిత్, అన్వేష్, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు రాణి, వీధివ్యాపారులు పాల్గొన్నారు.

### పన్నులు సకాలంలో చెల్లించాలి

**మాక్లూర్:** పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని డీపీవో జయసుధ పాల్గొన్నారు. మండలంలోని మదన్‌పల్లిలో మంగళవారం సర్పంచ్ ఎనుగంటి శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆస్తి పన్ను వసూలు స్పెషల్ డ్రైవ్‌లో డీపీవోతో పాటు ఎంపీడీవో క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మహేష్ ఇంటింట వెళ్లి పన్ను వసూలు చేశారు. సమస్యలపై స్థానికులు విన్నవించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో డీపీవో సమావేశం నిర్వహిచారు.



డీపీవోకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

## సమన్వయంతో పని చేస్తే విజయం తథ్యం

- డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి

**రుద్రూర్:** నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం అని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రుద్రూర్‌లో హాత్‌సే హాత్ జోడో అభియాన్ బాన్సువాడ సెగ్మెంట్ బ్లాక్ సమావేశం మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ నెల 26 నుంచి కొనసాగనున్న హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ హయంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని సూచించారు. త్వరలోనే నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించనుననట్లు వెల్లడించారు. అంతకు ముందు కొందరు పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా నాయకత్వ లోపం నియోజకవర్గానికి శాపంగా మారిందన్నారు. కార్యకర్తల అభీష్టాన్ని గౌరవించాలని కోరారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తహెర్ బీన్ హుందాన్, కార్యదర్శి గడుగు గంగాధర్, బాన్సు వాడ సెగ్మెంట్ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్, రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు లావణ్య, నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావ్, కొట్టం మనోహర్, గంగాప్రసాద్ పాల్గొన్నారు.
**మోర్తాడ్:** హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలని మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ కోరారు. ఏర్గట్ల మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకెట్ రవి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల దీక్షకు శివసేన నేతల మద్దతు



**బోధన్:** బోధన్ ప్రత్యేక జిల్లా కోసం న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు శివసేన పార్టీ నేతలు మద్దతు తెలిపారు. ప్రత్యేక జిల్లా కోసం కోర్టు ఎదుట చేపట్టిన దీక్షలు 23వ రోజుకు చేరాయి. శివసేన పార్టీ పట్టణ నాయకులు గౌతమ్ గౌడ్, లోకేష్ గౌడ్, కిరణ్, విజయ్, శ్రీకాంత్, రాజు తదితరులు మద్దతు ప్రకటించారు. దీక్షలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎమ్.గంగా రెడ్డి, న్యాయవాదులు హన్మంతరావు, ఈశ్వర్, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు పింఛన్లు ఇవ్వాలి



వేల్పూరులో ఆందోళన చేస్తున్న బీడీ కార్మికులు

**రుద్రూర్:** మంజూరైన ఆసరా పింఛన్లు ఇవ్వాలని మండలంలోని బొప్పాపూర్‌కు చెందిన పలువురు మహిళలు మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి తరలివచ్చారు. ఇంటి యజమాని మృతి చెంది ఏళ్లు గడుస్తున్నా ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించకుండా విచారణ పేరుతో పింఛన్లు తిరస్కరించడం అన్యాయం అని ఉప సర్పంచ్ పట్ల సురేష్ అన్నారు.
**వేల్పూర్ :** బీడీ కార్మికులందరికీ ఆసరా పింఛన్ ఇవ్వాలని వేల్పూర్‌లో తెలంగాణ ప్రగతిశీల బీడీ కార్మిక యోజన ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన నిర్వహించారు. బీడీ పరిశ్రమ యాజమాన్యం ఉపాధి కల్పించడం లేదని ఆదుకునేందుకు ప్రభుత్వం పింఛన్ ఇవ్వాలని కోరారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎంపీడీవో బషీరుద్దీన్

**వర్ని:** మొక్కల పంపిణీలో నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో బషీరుద్దీన్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు ఎప్పటికప్పుడు పాదులు తీసి అవసరమైన నీరు అందించాలన్నారు. సమావేశంలో ఎంపీవో చందర్ నాయక్, ఏపీవో మంజుల పాల్గొన్నారు.
**కోటగిరి:** ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ సూచించారు. కార్యదర్శులతో సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన కోటగిరి, పోతంగల్, అడ్కాస్ పల్లి, జల్లాపల్లి, కొడిచర్ల, దేవునిగుట్ట తండాలో అవెన్యూ ప్లాంటేషన్, మన ఊరు – మన బడి, క్రీడా ప్రాంగణాలు, మినీ బృహత్ పల్లె ప్రకృతి వనాల పనులను పరిశీలించారు. ఎంపీడీవో మారుతి, ఏపీవో రమణ, హెల్త్ సూపర్ వైజర్ కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సుమలత, మణి పాల్గొన్నారు.

## ముగిసిన సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం



సాఫ్ట్‌బాల్ జట్టుతో తహసీల్దార్, ఎస్సై



జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాలికల జట్టు..

**డిచ్‌పల్లి:** మండలంలోని సుద్దపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడామైదానంలో గత పది రోజులుగా జిల్లా సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ జట్టుకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ శ్రీనివాసరావు, గౌరవ అతిథిగా డిచ్‌పల్లి ఎస్సైగణేష్ హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈ నెల 11నుంచి 13వరకు జరుగనున్న 8వ రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. నిజామాబాద్ జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణించడంపై ఎస్సై గణేష్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ గోదావరి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్, మల్లేష్‌గౌడ్, లత, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

**బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం..**
డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడామైదానంలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న జిల్లా జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ బాలికల శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై లింబాద్రి తన వంతు సహకారంగా క్రీడాకారినులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ నెల 12 నుంచి 14వరకు ఖమ్మం జిల్లా బోనకల్లులో జరిగే 67వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి విజేతగా నిలవాలని కోరారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిషన్, రీజినల్ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ నీరజ, శ్యామ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**టిప్పర్ పట్టివేత**
**రెంజల్:** అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం రాత్రి సాటాపూర్ సమీపంలో పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు.

**పక్కాగా పంట వివరాల నమోదు**
**బాల్కొండ:** పంట వివరాల నమోదు పక్కాగా చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మండలంలోని జలాల్‌పూర్, నాగాపూర్ గ్రామాల్లో ఆయన పంట వివరాల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో కృష్ణవేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రాలను నమ్మొద్దు**
**మాక్లూర్:** మంత్రాలను నమ్మి అనర్థాలను కొని తెచ్చుకోవద్దని ఎస్సై యాదగిరిగౌడ్ సూచించారు. మంగళవారం మండలంలోని సట్లాపూర్ తండాలో పోలీస్ కళాబృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట**
**వేల్పూర్:** రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ మిట్టపల్లి మహిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులను పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకులు పేర్కొనడం సరికాదన్నారు.

**ముగ్గుల పోటీలు**
**బోధన్‌రూరల్:** తెలుగు పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా అన్నారు. సంక్రాతి పండుగ సంబరాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పెంటాకాలన్, సాలూర గ్రామాల్లో ముగ్గుల పోటిలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఆమె బహుమతులు అందచేశారు.

**చెక్కుల పంపిణీ**
**కమ్మర్‌పల్లి:** మండలంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను ఎంపీపీ గౌతమి, సొసైటీ చైర్మన్ దేవేందర్, సర్పంచ్‌లు అశోక్, లస్కర్ పంపిణీ చేశారు.
**మాక్లూర్:** మండలంలోని అడవి మామిడిపల్లిలో సర్పంచ్ చింత మల్లారెడ్డి పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్, కర్రెన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**వృద్ధులకు దుప్పట్ల పంపిణీ**
**కోటగిరి:** చలి నుంచి ఉపసమనం పొందేందుకు వృద్ధులకు మండలంలోని ఎత్తొండ గ్రామానికి చెందిన ఆదినారాయణ అనే రైతు దుప్పట్లు పంపిణీ చేశారు. పూరి గుడిసెలు, రేకుల షెడ్లలో నివాసం ఉంటున్న పేదలకు దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదినారాయణను గ్రామంలోని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రతినిధి శానం సాయులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, గంగరాజు పాల్గొన్నారు.

**కేసు ఉప సంహరించుకోవాలి**
**పెర్కిట్(ఆర్మూర్):** భూ నిర్వాసితుల కేసు విషయంలో ప్రభుత్వ ఆస్తుల జప్తు చేయాలని కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను అందజేయడానికి వచ్చిన బేలిఫ్, న్యాయవాదుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రం గణపతిపై నమోదు చేసిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.